


# నిరీక్షణ

## "కొలకలూరి"

బొమ్మను గుండెలకు హత్తుకొని, కళ్లు తన్మయంగా మూసుకొని, పందిర మంచం మీద పడుకొని వుంది నిరీక్షణ. ఆమె కనుల లోంచి జారిపోయిన కన్నీరు చెక్కిళ్ల మీద చారికలు కట్టింది. ఆమె నొసటి ముడతల్లో ఏదో కోర్కెకు సంబంధించిన నలుపు తెలుపులూ, ఎత్తుపల్లాలూ గోచరిస్తున్నాయి.

ఇల్లు నిశ్చలంగా వుంది. నిరీక్షణ నీరసంగా స్తబ్దంగా వుంది. ఆమె ఎడతెగని బాధతో, నిరంతరమైన దిగులుతో, హృదయంలో కోర్కెల కుదుపులతో, అంతులేని వ్యధతో పడుకొని వుంది. ఎన్నో జన్మలనుంచి ఏర్పడిన ప్రపంచంలోని దైన్యమంతా ఏకమై ఒక రూపం పొందితే ఆ మూర్తి ఎలా వుంటుందో అలా వుంది. నిరీక్షణ.

పడకలో వున్న మగపిల్లవాడి బొమ్మకు ఆడపిల్ల అలంకరణ చేసింది. నిరీక్షణ.

ఆమె బొమ్మకు చుక్కలగౌను తొడిగింది. చిన్న నిక్కరు వేసింది. కనులకు కాటుక పెట్టింది. నొసటిని కుంకుమ దిద్దింది. తలలో పూలు తురిమింది. మెడలో చంద్రహారం అలంకరించింది. కాళ్లకు గజ్జెల అందెలు కట్టింది.

చంద్రబాబు రావటం నిరీక్షణ చూడలేదు. ఆమె తన్మయత్వంలోనే మమతతో వుంది. అతను బొమ్మవైపు చూశాడు. కళ్లలో నీటిబిందువులు కదిలాయి.

బొమ్మను కుతూహలంగా పాప అనుకొని, బంతి ఆట ఉత్సాహంగా ఆడుకుంటూ, ముద్దుగా, మురిపెంగా మాతృ హృదయం పెంచుకుంటూ, కాలం గడపటం నిరీక్షణకు పరిపాటయిపోయింది.

ఐదు నెలల నుంచి బొమ్మతో నిరీక్షణ అలా గడుపుతూ వుంది.

పాపను 'అమ్మా' ని ముచ్చటగా పిలవటం, చెవులు నులిమి, బుగ్గమీద చిటికె వేసి, ఏడ్వ మనటం, అక్షరాలు చెప్పి అవి పలక మనటం, దూరంగా వున్న పువ్వును చూపి, తీసుకు రమ్మనటం, రోజూ మామూలుగా నిరీక్షణ చేస్తూ

వుంటుంది.

బొమ్మను ఉదయాన్నే సబ్బుతో స్నానం చేయించి, ఆ తరవాత ఉగ్గుపోసి, ఆపైన ఉయ్యాలలో పడుకోబెట్టి జోల పాడుతూ మైమరచి పోవటం నిరీక్షణ ఉదయ కార్యక్రమం.

బొమ్మను ఎత్తుకొని ప్రక్కయిళ్లకు పోయి, ఎవు పాప అని చెప్పుకొని, ఆనందించేది నిరీక్షణ. బొమ్మకు వెన్నముద్దలు తినిపిస్తూ, ఆదమరచి పోవటం అలవాటు చేసుకుంది నిరీక్షణ.

తమకు సంబంధించిన పనుల్లో బొమ్మ నుంచి కొన్ని సమయాల్లో జవాబు రాకపోతే నిరీక్షణ ఏడ్చేది. ఇలా ఆమె దాదాపు పిచ్చిమనిషిగా మారిపోయింది.

బొమ్మకు నిరీక్షణ 'రాణి' అని పేరు పెట్టింది. భర్తతో సంప్రదించి ఆస్తి అంతా రాణి పేరుతో వీలునామా వ్రాయించింది. అన్న కొడుకు 'రాజా' కీ, తనకూతురు బొమ్మకీ వివాహం చేయించింది. పెళ్లి అయిపోయిం తరువాత వేడుక బాగా జరగలేదని నిరీక్షణ గోలపెట్టింది.

రాత్రి సమయాల్లో గోడమీద పడుతున్న వెలుతురుకి అడ్డంగా బొమ్మను పెట్టి, గోడమీద పడిన నీడను చూచిఆనందిస్తూ, బొమ్మను గోడకు దూరం చేస్తున్న కొద్దీ పెరుగుతున్న నీడను చూచి తన పసిపాప పెరిగి పెద్దయి పోతున్నట్లు నిరీక్షణ ఆనందంగా తలంచేది.

బొమ్మతో చూస్తూవున్న చంద్రబాబు నయనాలలోనుంచి కన్నీరు జారిపోయింది. ఐదు నెలలనుంచి నిరీక్షణలో బొమ్మ మీద వాత్సల్యం పెరిగింది. అప్పటినుంచీ ఆమె మామూలు మనిషి కాదు.

నిరీక్షణ వైపు చంద్రబాబు చూస్తూ వున్నాడు. ఆమె ఆకారం, అయిదోనెల స్త్రీ ఆకారం లాగా వుంది. ఆమె నిజంగా అయిదో నెల గర్భంతోనే వుంటే తనూ, బంధువులూ, మిత్రులూ, ఉద్యోగులూ, సేవకులూ అందరూ అంతులేని సంతోషాన్ని అనుభవిస్తారు.

అయితే ఆమె ఉదరంలో నీటిబల్ల పెరుగుతూ వుంది. అది తనకు తెలుసు. ఆ విషయంలో అనుమానం లేదు. ఆశంసనం అంతకంటే లేదు.

చంద్రబాబు భావించాడు.

తనకు పున్నామ నరకం తప్పదు. తనమీద భగవంతుడికి దయలేదు. అసలు తను చేసింది మూర్ఖమైన పని. ఎవరూ క్షమించ లేని పని. ప్రకృతి సహజ ధర్మం ఉల్లంఘించిన తనకు నిష్కృతి లేదు. తన జీవితానికిక పరిష్కారం వుండదు. తన దుష్కర్మకు పర్యవసానం ప్రళయమే. యముడు విలయంగా తాండవం చేసే ప్రళయం. శివుడు కన్ను తెరిచే ప్రళయం. తను కారణంగా కుటుంబం నాశనమై పోతూంది. తనను తను బలి చేసుకున్నాడు. తనగొంతుక తను నులుం కుంటున్నాడు. కీడు కోరి తెచ్చి నెత్తిమీద పెట్టుకున్నాడు. ఆపదను ఆహ్వానించి కరాళ నృత్యం తిలకిస్తున్నాడు. నిందని కొనితెచ్చి అనుభవిస్తున్నాడు. భయం గుండెల మీద పెట్టుకొని దర్శిస్తున్నాడు. సర్వసుఖాల శోభలతో స్వర్గతుల్యంగా సాగుతున్న కుటుంబంలో నరకం సృష్టించుకున్నాడు. ఈ నరకం చేతుల కల్పించిన ఛాయల కొనుట నిర్ణయించిన ప్రతిబింబాలు తన బ్రతుకు మిధ్య చేస్తున్నాయి. తను పతనమైపోతే విధి పాతాళంలోకి తొక్కుతున్నాడు. అక్కడ్నుంచి తను కోలుకోలేడు. లేవలేడు. సుఖాన్ని శాశ్వతంగా వాళసం చేసుకున్న ఎవడూ లేవలేడు. పూలు వికసించవలసిన కొమ్మ చివర మొగ్గలు తుంచిన తన బ్రతుకిక ఎడారి.

భయంకరమైన ఎడారి. ఎండమావుల ఎడారి. వేడి సెగల, ఇసుక తెరల, వడగాడ్పుల, ఎడారి.

నిరీక్షణ దిగులుతో వుంది. నీటిబల్లవల్ల శారీరకంగా బలహీనురాలయింది. దిగులూ బలహీనతా ఆమెను మరీ పిచ్చి మనిషిగా తయారు చేస్తున్నాయి. దేవుడా! ఏమిటీ వైపరీత్యం!

చంద్రబాబు బాగా బాధ పడ్డాడు. లోపల గదిలోకి పోయి కూర్చున్నాడు. అతన్ని ఆమె చూడలేదు.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. రెండు హృదయాలు నిరవశేషంగా యాతన అనుభవిస్తున్నాయి.

పన్నెండు సంవత్సరాల నాడు చంద్రబాబుకీ, నిరీక్షణకీ పెండ్లయింది.

చంద్రబాబుకి చాలా ఆస్తివుంది. నిరీక్షణ జమిందారీ కుటుంబానికి చెందిన అమ్మాయి. కట్నం కానుకల రూపంలో చాలా ఆస్తి వచ్చింది.

చంద్రబాబు సైంటిస్టు. గవర్నమెంటు రీసర్చి ఫరమ్‌లో ఉద్యోగి. జీతం బాగా వస్తుంది. జీవితం బాగా సాగుతూంది.

చంద్రబాబు మంచివాడు కనుకనే అందరూ అతని అభ్యుదయాన్ని కోరుతూ వుంటారు.

పెళ్ళయిన సంవత్సరానికి నిరీక్షణ కాపురానికి వచ్చింది.

నిరీక్షణ కాపురానికి వచ్చిన నాలుగు సంవత్సరాలకు ముగ్గురు మగపిల్లలు పుట్టారు.

ఆ మధ్య సంతాన నిరోధం ప్రచారం బాగా సాగింది.

చంద్రబాబు బాగా ఆలోచించాడు. లాభాలూ—నష్టాలూ పరిశీలించాడు. ఆలోచన ఎక్కువ కాలమే సాగింది. చాలా పుస్తకాలు చదివాడు. పరిస్థితులన్నీ కలయ చూశాడు. చివరకు నిరీక్షణకు ఆపరేషన్ చేయించాడు.

చంద్రబాబు మేలుకోరే ఎవరూ ఈ పనిని ఒప్పుకోలేదు. అయితే ఎవరి అభిప్రాయమూ అతనికి అక్కర లేకపోయింది.

నిరీక్షణకూ ఆ విషయం ఇష్టంలేదు. కాని భర్త మాట కాదన లేకపోయింది. చక్కగా ముద్దుగా ముచ్చటగా పెరుగుతున్న ముగ్గురు మగపిల్లల్ని చూచుకొని భర్తతో అనుమతి తెలియచేసింది.

ఆపైన నాలుగు సంవత్సరాల వరకు జీవితం ఏ ఒడుదుడుకూ లేకుండా సాఫీగా సాగిపోయింది. కానీ విధి ఆ మధ్య చిన్నచూపు చూశాడు.

పిల్లలు పనివాళ్ళ చేతుల్లో హాయిగా పెరుగుతున్నారు. పసివాళ్ళకోసం ప్రత్యేకంగా చేసిన పరమాన్నంలో ఏదో వూహించని లోపం జరిగి ఎవరూ కారణం కాకుండా బలవత్తర భగవద్విధానం జరిగినట్లు ముగ్గురు పిల్లలూ ఒక్కరోజు మరణించారు.

అప్పటనుంచి చంద్రబాబు జీవితం ఎదురు తిరిగింది. మాతృమూర్తి నిరీక్షణ సంవత్సరం దాకా మనిషి కాలేక పోయింది.

పసిపిల్లలు ఆడుకుంటూ వుంటే నిరీక్షణ ఏడ్చేది. పుణ్యస్త్రీలు పేరంటానికి పిల్లలతో వస్తే అక్కడ నిలబడ లేకపోయేది. గర్భిణీ స్త్రీలు ఎదురైతే నిరీక్షణ వలవలా విలపించేది.

దంపతులకు వారిజీవితం నిస్సారంగా, నిరర్థకంగా కనిపించింది. వాళ్ళు వూహించని నరకం, ఎదుట నగ్ననృత్యం చేస్తూ వుంటే చరించిపోయేవాళ్ళు.

ఏమి చేయటానికైనా, ఏ గమనం సాగటానికైనా, ఏ కోర్కెలు తీరటానికైనా, ఏ ఆశలు పెరగటానికైనా ఏదీ ఏమీ వాళ్ళ లక్ష్యంలో లేకుండా పోయింది.

ప్రకృతిని తిరస్కరించిన వాళ్ళకీ, సహజ ధర్మాన్ని వ్యతిరేకించిన వాళ్ళకీ, దేవుడ్ని అవమానపరచిన వాళ్ళకీ శిక్ష తప్పదు.

మేకపిల్లలు అమాయకంగా కసాయివాడి కరకు కత్తికి గురి అయినట్లు దంపతులిద్దరూ బలి అయ్యారు.

పిల్లల మీద అప్యాయతతో, మమతతో, కోర్కెతో, అనురాగంతో—అనురాగం దూరమైన దిగులుతో, బాధతో, కష్టంతో యాతనతో—యాతనతో పుట్టిన నరకంతో—నరకంలోని చిత్రవధతో, నాడులూ సడలిపోయి, శరీరాలు వ్రీలిపోయి, దుఃఖం కట్టు తెగి, మనస్సు మొదళ్ళు నరికితే కూలిన చెట్టులాగా, గొంతులు మెలిపెడితే పాడలేని కోకిలలు లాగా, రెక్కలు తుంచితే ఎగురలేని తుమ్మెదలు లాగా, కుమిలి పోయారు.

ఒక గదిలో నిరీక్షణ పడుకుని వుంది. మరొక గదిలో చంద్రబాబు కూర్చుని వున్నాడు. గతమంతా అతని కనుల నీటిలో కరిగి పోయింది.

ఆపరేషన్ జరిగిన రోజు మీద అతని ఆలోచన సాగింది. ఆ సంఘటనమీద దృష్టి నిలచింది. మెరుపు తళుక్కుమన్నట్లు అతనికి ఒక విషయం గుర్తుకు వచ్చింది.

నిరీక్షణకు మాత్రమే ఆపరేషన్ జరిగింది. చంద్రబాబుకి జరగలేదు.

తను మరొక్క పెళ్ళి చేసుకుంటే కలుగవచ్చు. అయితే ఆపని తను చేయడు. ద్రోహం నిరీక్షణకు చేయలేడు.

తను పెళ్ళి చేసుకున్నా, పిల్లలు నిరీక్షణ దుఃఖం మాత్రం పోదు. ఆమె ఒడ్డులేని సముద్రం.

సృష్టి చేయలేని మానవులు సృష్టిని నాశనం చేస్తున్నారు. మానవుడికీ దానవుడికీ తేడా ఏమిటి ?

సైంటిస్టు అయిన చంద్రబాబుకి సైంటిస్టుల మీద కోపం ముంచుకు వచ్చింది. హృదయంలోనే సంతాన నిరోధక ప్రచారాన్ని దూషించాడు.

చంద్రబాబు గబగబా లేచి అలమరా దగ్గరకు పోయాడు. అందులోంచి ఒక గ్రంథం వేగంగా అందుకొని పరపరా చించటం సాగించాడు.

అది సంతాన నిరోధక ప్రచార గ్రంథం.

పుస్తకం చించుతూవుంటే అతనికొక పుట గోచరించింది. ఆ పుటలో ఏదో ఆశాజనకంగా వున్న వాక్యం కనిపించింది.

ఆవాక్యం చదివాడు, మళ్ళీ మళ్ళీ చదివాడు. ఉత్సాహంగా చదివాడు.

ఆపరేషన్‌లు అన్నీ విజయవంతాలు కావు. నూటికి తొంభై నిక్కచ్చిగా విజయం పొందుతాయి. ఆయిదు చెప్పలేం. అయిదు ఫెయిల్ ఆవుతాయి.

ఆ చివరి అయిదులో తన హృదయేశ్వరి ఆపరేషన్ ఉండకూడదా దేవుడా! అనుకున్నాడు చంద్రబాబు.

చించిన కాగితాలు స్టౌలో పడేశాడు. కాలి బూడిద అయిపోయాయి.

చంద్రబాబు కూర్చునేవున్నాడు, ఏవో ఆలోచనలు వస్తున్నాయి. నీడా—వెలుగూ రెండూ మిళితమయ్యేటప్పుడు కలిగే క్రొత్తదనం ఏదో స్ఫురిస్తుంది.

అతని గుండెల లోయల్లో అట్టడుగునుంచి ఏదో దూరతీరాల సంగీతం పిలుపు అవ్యక్త మధురంగా వినవస్తూంది.

అతను లేచాడు. భార్య గదిలోకి పోయాడు. అప్పుడే ఆవిడ మేల్కొంది. అతని కళ్ళలోకి చూచింది. అతని కళ్ళు నీళ్ళతో నిండివున్నాయి. ఆమె కళ్ళలోకి చూశాడు. ఆ నయనాలు నీటి కుండలుగా వున్నాయి. ఆమె అతని ముఖం చూడలేకపోయింది. తల తిప్పుకుంది. తలగడలో దాచుకుంది. తలగడదిండు తడిసి వుంది.

చంద్రబాబు రోడ్డు మీదికి పోయాడు. పది నిమిషాల్లో తిరిగి వచ్చాడు. అతనివెంట ఫేమిలీ లేడీ డాక్టర్ వుంది. ఆమె ఆరునెల్ల నుంచి ఆ యింటికి రాలేదు. రావలసిన అవసరం లేకపోయింది.

లేడీ డాక్టర్ ఏదో సామానుకూడా తెచ్చుకుంది. నిరీక్షణను మరొక గదిలోకి తీసుకుపోయింది. నిరీక్షణ తనతోపాటు బొమ్మను మోసుకు పోయింది. ఆ బొమ్మను ఆమె ఎప్పుడూ వదిలి పెట్టదు. ఎవరికీ ఇవ్వదు.

లేడీ డాక్టరు నిరీక్షణను పరీక్ష చేస్తూ వుంది. ప్రక్కగదిలో చంద్రబాబు ఏ ఆలోచనా లేకుండ కూర్చున్నాడు.

ఆరోగ్యంగా వున్న మగపిల్లవాడు ఉయ్యాల లోవుంటె బలంగా వూగినట్లు చంద్రబాబు హృదయం ఆశ నిరాశల మధ్య వూగిసలాడుతూ వుంది.

డాక్టరు ఏమి చెబుతుందో వినటంకోసం చంద్రబాబు నేయికళ్ళతో ఎదురు చూస్తున్నాడు.

ఏదో అవసరం కలిగి డాక్టరు ఒకసారి బయటికి వచ్చి ఫోను చేసి ఏమీ చెప్పకుండా గదిలోకి పోయింది. ఆమె ముఖం నిండుగా వుంది. నవ్వు మాత్రం లీలగా గోచరించింది.

డాక్టరు చాలాసేపు పరీక్ష చేసింది. ఆతరువాత తలుపు తీసింది.

డాక్టరు నవ్వుతూ వచ్చింది.

నిరీక్షణ వెలుపలికి వచ్చింది. ఆమె ముఖంలో మూడు సంవత్సరాల తరువాత నవ్వుల పువ్వులు కనిపించాయి. నిరీక్షణ ముఖం నిండుగా పున్నమి చంద్రబింబంలాగా వుంది.

నిరీక్షణ తల వంచుకునే చేతుల్లో వున్న బొమ్మను చంద్రబాబుకి ఇచ్చింది. ఐదునెల్ల తరువాత ఆమె బొమ్మను విడిచిపెట్టింది.

నిరీక్షణ చంద్రబాబు ప్రక్కనే నిలబడింది. ముఖం దించుకునే వుంది. చాలా ఆనందంగా వుంది. గోళ్ళు గిల్లుకుంటూ వుంది. కాలిబొటన ప్రేలితో నేల రాస్తూవుంది.

లేడీ డాక్టరు నవ్వుతూ చెబుతూ వుంది.

చంద్రబాబు ఆశగా వింటున్నాడు.

నిరీక్షణ సిగ్గుతో మరీవూరక కుంచించుకు పోతూవుంది.

డాక్టర్ చెప్పింది.

'నిరీక్షణకు అయిదో నెల' ★

